ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని నిరసన

బోర్లం ప్రాథమిక పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 17 : త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం బోర్లం ప్రాథమిక పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎన్నికల సంఘంతో చర్చించి ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓట హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపి, అయ్యాల సంతోష్, చైతన్య, రమేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలని..

భిక్కనూరు, అక్టోబర్ 17 : 2014లో నియామకమైన రెగ్యులర్ అధ్యాపకులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని సౌత్ క్యాంపస్ అధ్యాపకులు గురువారం ధర్నా నిర్వహించారు. నల్లబాడ్జీలు ధరించి ప్రిన్సిపాల్ ఆఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యంతో అన్ని అర్హతలు ఉన్నా ఉద్యోగోన్నతులు పొందలేకపోతున్నామని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉద్యోగోన్నతులు కల్పించాలని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మోహన్ బాబు, హరిత, అంజయ్య, నాగరాజు, ప్రతిజ్ఞ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని వినతి

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 17 : మూడేండ్లుగా ప్రైవేట్ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ప్రైవేట్ కళాశాల యాజమాన్యం గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాల అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు చెల్లించడం ఇబ్బందిగా మారిందని అన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను చెల్లించని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు నిఖిల్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా విద్యార్థులపై మొండి వైఖరి తగదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు భాను, ప్రశాంత్ దినేశ్, అరుణ్, సందీప్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

కామారెడ్డి రూరల్, అక్టోబర్ 17 : రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలు శాస్త్ర సాంకేతిక విద్యామండలి-హైదరాబాద్‌లో గురువారం నిర్వహించారు. ఇందులో జిల్లా నుంచి ఇసాయిపేట, పాల్వంచ మండలాల విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రదర్శనను ఇచ్చారు. విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా మార్గదర్శనం చేసిన మాధురి, చక్కటి ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులను డైరెక్టర్ ఎస్‌సీఆర్‌టీ రమేశ్ అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది కలుగకుండా చూడాలి

కలెక్టర్ అశీష్ సంగ్వాన్

గాంధారి, అక్టోబర్ 17: వానకాలం లో రైతులు సాగుచేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సెర్ప్, ఐకేపీ, సొసైటీలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు గురువారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అశీష్ సంగ్వాన్ అన్నారు. గాంధారి మండలంలోని సీతాయిపల్లిలో ముదెల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కాంటా చేసిన ధాన్యాన్ని లోడింగ్ చేసి రైస్ మిల్లులకు తరలించి వెంటనే అన్‌లోడింగ్ అయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన ముదెల్లిలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, వంట గదిని తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ముదెల్లి విండో చైర్మన్ సాయిరాం, గాంధారి ఏఎంసీ చైర్మన్ పరమేశ్, నాయబ్ తహసీల్దార్ రవి, విండో కార్యదర్శి కృష్ణారెడ్డి, విండో మాజీ చైర్మన్ సింగసాని శ్రీనివాస్, మాజీ సర్పంచులు బీర్కూర్ రాజు, పిట్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అశీష్ సంగ్వాన్

తాడ్కోల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..

బాన్సువాడ రూరల్/బాన్సువాడ, అక్టోబర్ 17 : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బుడ్మి సహకార సంఘం ఆధ్వర్యంలో తాడ్కోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గంగారాం, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గంగుల గంగారాం, బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి, నాయకులు సురేశ్‌గుప్తా, దొడ్ల వెంకట్రాంరెడ్డి, శ్రీధర్, గోపాల్‌రెడ్డి, ఎజాస్, రాజు, లక్ష్మి గౌడ్, వెంకట్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు. బీర్కూర్ మండలం కిష్టాపూర్, బీర్కూర్, బరంగేడ్గి గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీర్కూర్ తహసీల్దార్ లత, సొసైటీ చైర్మన్ గాంధీ, బోయిని శంకర్, ఫీరాజీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

భవానీపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో సురేందర్

లింగంపేట/నాగిరెడ్డిపేట/రామారెడ్డి/మద్నూర్/పెద్దకొడప్‌గల్, అక్టోబర్17: లింగంపేట మండలంలోని పోల్కంపేట గ్రామంలో సెర్ప్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డీపీఎం రమేశ్‌బాబు, ఎంపీడీవో నరేశ్, ఏపీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. భవానీపేట గ్రామంలో డీఆర్డీవో సురేందర్, శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో సహకార సంఘం సీఈవో శ్రీనివాస్, లింగంపేట సహకార సంఘం అధ్వర్యంలో పోతాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మెంగారం గ్రామంలో వైస్ చైర్మన్ మాకం రాములు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లికలాన్, వెంకంపల్లి, బంజరా గ్రామాల్లో మాల్తుమ్మెద సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను విండో చైర్మన్ దుందిగల్ల నర్సింహులు ప్రారంభించారు. ఏఈ సందీప్‌కుమార్, నాయకులు రాజిరెడ్డి, సిద్ధయ్య, సృజన్‌రెడ్డి, రాంకిష్టయ్య, ఏఎమ్‌సీ డైరెక్టర్ నగేశ్, లక్ష్మణ్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు. సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో ప్రజాపతితోపాటు బాబూరావు, దామోదర్, లింగారావు, రైతులు పాల్గొన్నారు. డోంగ్లీ సహకార సంఘంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైస్‌చైర్మన్ విజయ్‌పటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రేణుకా చౌహాన్, నాయకులు శశాంక్‌పటేల్, నాగేశ్‌పటేల్, పరమేశ్, సిబ్బంది గంగాధర్ పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని కంభాపూర్‌లో సొసైటీ చైర్మన్ వెంకట్‌రారెడ్డి, కాటేపల్లిలో చిన్నకొడప్‌గల్ సొసైటీ చైర్మన్ నాగిరెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మాచారెడ్డి/కామారెడ్డి రూరల్, అక్టోబర్ 17 : గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడారు. సమయపాలన పాటించాలని అన్నారు. ప్రతిరోజూ ఎంత మందికి వైద్యం అందిస్తున్నారు.. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట వైద్యసిబ్బంది ఉన్నారు. కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

మాచారెడ్డిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బాన్సువాడ, అక్టోబర్ 17 : బీర్కూర్‌కు చెందిన తాటిచెట్ల రాములు(52) బీర్కూర్ కమాన్ వద్ద బాన్సువాడకు వెళ్లే రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గురువారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్‌కు చెందిన రాములు వృత్తిరీత్యా హమాలీ పనిచేసే వాడు. బుధవారం రాత్రి బయటికి నడుచుకుంటూ వెళ్లగా.. బీర్కూర్ కమాన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రాములు రెండు కాళ్లు విరిగిపోయాయి. ఘటనా స్థలానికి బంధువులు చేరకొని, రాములును చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఘనంగా కళా ఉత్సవ్-2024

కామారెడ్డి రూరల్, అక్టోబర్ 17 : జిల్లాస్థాయి కళా ఉత్సవ్-2024 కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష కామారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. విద్యార్థులు చదువులోనే కాకుండా సాంస్కృతిక, కళారంగాల్లో కూడా ప్రతిభ చూపాలని, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు కోరారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి రూరల్, అక్టోబర్ 17 : పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఆలయాలను ధ్వంసం చేసి విగ్రహాలు, వస్తువులను ఎత్తుకెళ్లినవారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో ముత్యాలమ్మ, పోచమ్మ, లక్ష్మమ్మ ఆలయాలను అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేసి విగ్రహాలు ఎత్తుకెళ్లారని తెలిపారు. నిందితులను పట్టుకొని విగ్రహాలను రికవరీ చేయాలని కోరారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నిట్టు వేణుగోపాల్, నిట్టు కృష్ణమూర్తి, ముప్పారపు ఆనంద్, మంచు రవి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా ఫరీదా

కామారెడ్డి రూరల్, అక్టోబర్17 : జిల్లా ప్రభుత్వ దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ రాంసింగ్ సొంత పనుల నిమిత్తం సెలవులపై వెళ్లారు. ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఫరీదాకు బాధ్యతలు అప్పగించారు.

పశువులకు టీకాలు వేయించాలి

రాజంపేట్, అక్టోబర్ 17 : మండల కేంద్రంలో పాడిపశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు సహాయ సంచాలకుడు డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అనిల్ రెడ్డి, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో బంద్ ప్రశాంతం

బాన్సువాడ, అక్టోబర్ 17 : హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో గురువారం బీర్కూర్ బంద్‌ను నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై రాజశేఖర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెక్కు అందజేత

భిక్కనూరు, అక్టోబర్ 17 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సౌత్ క్యాంపస్ విద్యార్థి ప్రీతం కుటుంబ సభ్యులకు యూనివర్సిటీ తరపున రూ. లక్షా 13,300 చెక్కును గురువారం అందజేసినట్లు రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, వార్డెన్ యాలాద్రి, అధ్యాపకులు సునీత, హరిత, ప్రతిజ్ఞ, నారాయణ, రమాదేవి, నర్సయ్య, ఇంద్రకరణ్, పోతన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

రామారెడ్డి/ నాగిరెడ్డిపేట/ రాజంపేట, అక్టోబర్ 17: సదాశివనగర్‌లో పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగారెడ్డి, తహసీల్దార్ గంగాసాగర్ గురువారం పంపిణీ చేశారు. మండలానికి చెందిన 41 మందికి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, 37మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని 20 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌గౌడ్, లక్ష్మణ్, సాయిబాబాగౌడ్, దివిటి కిష్టయ్య, శ్రీరామ్‌గౌడ్, కిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేట మండలంలోని కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, సిద్దాపూర్ గ్రామాల్లోని 13 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచనల మేరకు లబ్ధిదారులకు చెక్కులను అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్‌లో చెక్కులను అందజేస్తున్న తహసీల్దార్ గంగాసాగర్, కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలి

ఎల్లారెడ్డి కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణుడు రమణ, లింగంపేట జూనియర్ కాలేజీలో..

మానసిక వైద్య నిపుణుడు రమణ

లింగంపేట/ ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్17: విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలని జిల్లా మానసిక వైద్య నిపుణుడు రమణ సూచించారు. లింగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఎల్లారెడ్డి జూనియర్ కళాశాలలో గురువారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులు మానసిక సమస్యలను అధిగమించడానికి కాలేజీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయస్సు రీత్యా ప్రేమ సంబంధిత ఆకర్షణలకు లోనవుతున్నారన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగాఉండాని సూచించారు. మొబైల్ అతిగా వినియోగించి సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, దీంతో పరీక్షలు సరిగ్గా రాయక ఫెయిల్ అవుతున్నారని చెప్పారు. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో 14416నంబర్‌కు ఫోన్ చేస్తే మానసిక వైద్య నిపుణులు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో లింగంపేట మండల వైద్యాధికారిణి హిమబిందు, జిల్లా సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్‌కుమార్, లింగంపేట, ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు నరేందర్, నిజాముద్దీన్, సీహెచ్‌వో రమేశ్, అధ్యాపకులు దుర్గయ్య, అంజయ్య, రాజు, శ్రీలత, నాగు, శివ, స్వామి, రాజయ్య, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం
ఎల్లారెడ్డి పట్టణ కమిటీ ఎన్నిక

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 17: అంబేద్కర్ యువజన సంఘం ఎల్లారెడ్డి పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్ల సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యకుడిగా ఎర్రోళ్ల ఎల్లుబాబు, ఉపాధ్యక్షులుగా కృష్ణ, అంజయ్య, సాయిబాబు, సిద్ధు, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజు, సంయుక్త కార్యదర్శులుగా దేవకుమార్, గంగారాం, ప్రశాంత్, ముఖ్య సలహాదారుడిగా సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయరని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడు సాయిబాబు, మండల ఉపాధ్యక్షుడు పద్మారావు, కార్యదర్శి సాయిలు, కోశాధికారి మొగులయ్య, కార్యవర్గ సభ్యుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సన్మానం

రామారెడ్డి ఎంఈవో ఆనంద్‌రావును సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

రామారెడ్డి, అక్టోబర్ 17: రామారెడ్డి ఎంఈవోగా ఇటీవల బాధ్యతలను చేపట్టిన ఆనంద్‌రావును పీఆర్టీయూ జిల్లా నాయకులు గురువారం సన్మానించారు. రామారెడ్డి ఎమ్మార్సీ భవనంలో నూతన ఎంఈవోకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీరాజ్యం, రామారెడ్డి మండల అధ్యక్షుడు వెంకట్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు..

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జల్దిపల్లి గ్రామస్తులు

లింగంపేట, అక్టోబర్ 17: మండలంలోని జల్దిపల్లి గ్రామంలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను గ్రామస్తులు గురువారం సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు సాధించి జల్దిపల్లిలో బాధ్యతలను చేపట్టిన ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, సవితకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కోలగారి రాజు, కేశయ్య, బాలకృష్ణ, కిషన్, శేఖర్, స్వామి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్, అక్టోబర్ 17: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం 3,200 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా 4వేల క్యూసెక్కుల, ప్రధాన కాలువ ద్వారా 300 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4300 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగుల(17.802టీఎంసీలు)కు ప్రస్తుతం 1404.98 అడుగుల (17.773టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.

చేపల వల కాళ్లకు చుట్టుకొని వ్యక్తి మృతి

గాంధారి, అక్టోబర్ 17: చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వడ్డె శ్రీను (60), కాటిపాపల లక్ష్మణ్ కలిసి చేపలు, ఎండ్రికాయలను పట్టడానికి నేరల్ తండా సమీపంలో ఉన్న చెరువుకు వెళ్లారు. చెరువులో చేపలు పట్టడానికి వల వేసిన శ్రీను కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి భార్య సాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న షిండే

మద్నూర్, అక్టోబర్17: మండలంలోని హండికేలూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త షేక్ అప్చక్‌ఖాన్ గురువారం మృతిచెందాడు. ఆయన అంత్యక్రియల్లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, నాయకులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బన్సీపటేల్, మాజీ సర్పంచులు నర్సింహులు గౌడ్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

ఉపాధి పనులపై సమావేశం

నిజాంసాగర్, అక్టోబర్ 17: ఉపాధి హామీ పథకం పనులపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గంగాధర్ గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం నూతన ఏపీవో శివకుమార్‌కు స్వాగతం పలికారు. బదిలీపై వెళ్తున్న ఏపీవో శ్రీనివాస్‌ను సన్మానించారు. సమావేశంలో మండల పరిషత్ అధికారిణి అనిత, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
SITE FOR SALE
★EAST ఫేసింగ్ 40ft Road గా గల 158 చదరపు గజముల స్థలం అమ్మకమునకు కలదు. హౌసింగ్‌బోర్డ్ బృందావన్ కాలనీ, కామారెడ్డి సెల్: 9618126122, 7981741155
NTZ-334409
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజ